అనేక సాకులతో నీ స్పేస్‌లోకి చొరబడనని, నీ పొడగిట్టని నేను-నాది
అనే గిరి గీసుకోనని నా గురించి నాకు నమ్మకం. యీ నమ్మకం అన్నివేళలా
నాతో నిలవదు. నన్ను నువ్వు గుచ్చి చూసినప్పుడు నా గురించిన యెరుక
నాలోంచి జారిపోతుంది. నేనే లోన, బయట అనే రెండు వైరిపక్షాలుగా
చీలి యుద్ధానికి దిగుతాను, సామరస్యం కుదిరేదాకా.
అందులో భాగమే నా నిర్జన.

ఉమా నూతక్కి

14

# నిర్జన

అన్వర్





సాధారణంగా పొద్దున్నే వంటగదిలోకి వెళ్లదామె. ఒక ఫైనాన్షియల్ సెక్టార్‌లో మార్కెటింగ్ మేనేజర్‌గా చేస్తోంది. తన టీమ్స్‌తో మాట్లాడి, బిజినెస్ డేటా మొత్తం కలెక్ట్ చేసుకుని జోనల్ ఆఫీస్‌కి కమ్యూనికేట్ చేసి, మళ్లీ టార్గెట్లు ఫిక్స్ చేసుకుని, టీంకి ఎలోకేట్ చేసి ఆ రోజుకి పనయ్యింది అనుకునేటప్పటికి ఎక్కువసార్లు అర్ధరాత్రి అవుతుంది.. అలా లేట్ అయినప్పుడని మాత్రమే కాదు కానీ, మార్కెటింగ్ లోనూ ఫీల్డ్ వర్క్‌లోనూ ఉంది కనుక పొద్దున్నే ఆఫీసుకి పరిగెత్తాల్సిన పనిలేదు. కొంచం లీజర్లీగానే నిద్ర లేస్తుంది.

ఇంట్లో ఉండేది ముగ్గురు. అత్తగారూ, కూతురూ, తనూ. అయినా తన క్వాలిటీ సమయాలు వృధా కానీయకూడదు అనుకుంటుంది కాబట్టి వంటమనిషిని పెట్టుకుంది. వంటమనిషి పొద్దున్నే ఆరు గంటలకల్లా ఇంట్లో ఉండాలన్నది ఎగ్రిమెంట్. ముందూ వెనగ్గా పనమ్మాయి కూడా వచ్చేస్తుంది. వెనకుండి చేయించడమే కనుక, అత్తయ్య ఆ పనులన్నీ చక్కగానే చేయిస్తుంది.

కానీ, వంటామె ఐసొలేట్ అవడంవల్ల ఆరోజు పొద్దున్నే లేవాల్సిన పనిపడింది. అనుకోకుండా మీద పడిన ఈ షెడ్యూల్‌ని ముగ్గురూ పాజిటివ్‌గానే తీసుకున్నారు. దూరంగా వేరే ఊర్లో ఉద్యోగం చేస్తున్న భర్త కూడా మర్నాడు వస్తున్నాడని హుషారుగా ఉందామె. కొన్నాళ్లు ఆన్ అండ్ ఆఫ ఎవైలబుల్‌గా ఉంటానని ఆఫీస్‌కి మెయిల్ పెట్టాక, రాత్రి  రిలాక్స్‌డ్‌గా పడుకుంది. అనుకోకుండా వచ్చిన అవకాశం, దసరా సెలవులు, ముందురోజు సరదాగా కూతురితో కూర్చుని ఏమేం మెనూ కావాలో చెప్పమని ఉత్సాహపరిచింది. ఓటీటీలో ఒక సినిమా చూసినా, మర్నాడు పొద్దున్న రోజుటికన్నా పెందళాడే లేచింది.

పొద్దున్న నాలుగున్నరకి బాత్రూంకి వెళ్లినపుడు కిటికీలోంచి చూసిందా దృశ్యాన్ని. అప్పటికింకా చీకటిగా ఉంది. ముందురోజు రాత్రి భోరున కురిసిన వర్షం ఇంకా పూర్తిగా తెప్పరిల్లలేదు. కాలనీ చెట్ల మధ్యలోంచి, వర్షం చినుకుల వెనక, మినుకు మినుకు

మంటున్న లైట్ల వెలుగులో  కనబడిందా దృశ్యం. రోడ్డు చివర పల్లంగా ఉన్నచోట ఒక వారగా ఎర్రలారీ ఆగి ఉంది. కాలనీలోకి కొత్తగా వచ్చిన సామాన్ల లోడులా ఉంది. దాని పక్కనా వెనకా అయిదారుగురు పోలీసులు కుర్చీలు వేసుకుని కూర్చునున్నారు. పక్కన చప్టామీద యింకో నలుగురు మనుషులు. ఎవరో ఒకాయన మాటిమాటికీ అటూ ఇటూ తిరుగుతూ ఎవరితోనో ఫోన్ మాట్లాడుతున్నాడు.

అప్పటికేమీ ఆసక్తి కలగనట్లు లోపలికి వెళ్లిపోయింది. ఒక అరగంట తర్వాత కాఫీ డికాక్షన్ పెట్టుకుందామని వంటగదిలోకి వెళ్లినపుడు కిటికీలోంచి మళ్లీ చూసింది. ఇంకా చీకటిగానే ఉంది. జనాలు కూడా ఇంకాస్త పోగయినట్లున్నారు. ఈసారి కాస్త పరికించి చూసి, కాఫీ కలుపుకుంటుండగా బెల్ మోగింది. అప్పుడే గోదావరి ట్రెయిన్ దిగి ఇంటికి వచ్చిన భర్త ఫ్రెష్ అవ్వడానికి వెళ్లాక తన కప్ పట్టుకుని బాల్కనీలో కూర్చుంది.

పెద వాల్తేర్ బీచ్ డౌన్ రోడ్డులో ఆఫీస్ క్వార్టర్స్ అవి. నగరం నడిబొడ్డున ఉండే పెద్ద కాలనీ. మేనేజర్లకీ, ఆఫీసర్లకీ, స్టాఫ్‌కీ వేరువేరుగా మూడు బ్లాకులు ఉంటాయి. మేనేజర్లు ఉండే బ్లాక్‌లో అన్నీ ఇండివిడ్యువల్ క్వార్టర్లు. ఆఫీసర్లు ఉండేవి, స్టాఫ్ ఉండేవి నాలుగంతస్తుల అపార్ట్‌మెంటుల్లా ఉంటాయి.

పక్క క్వార్టర్‌లో ఉండే ఆవిడ అప్పుడే బయటకి వచ్చి తనను పలకరింపుగా చూసి ఏదో చెప్పబోయినట్లు ఒక అడుగు ముందుకి వేసింది. తనూ నవ్వీ నవ్వనట్లు తల ఊపి వెంటనే లోపలికి వచ్చేసింది. కొత్తవాళ్లతో తొందరగా కలవదు. పైగా అక్కడ ఉండేది అందరూ తమ ఆఫీసుల్లో వేర్వేరు బ్రాంచెస్‌లో ఉండే కొలీగ్స్ అయినా ప్రత్యేకంగా అక్కడ లేడీ మేనేజర్ తను ఒక్కతే. ఆఫీస్ కాన్ఫరెన్సుల్లో గల గలా మాట్లాడుతుందిగానీ బయట ఎవరితో అయినా మాట్లాడడానికి ఆమె దగ్గర పెద్దగా విషయాలుండవు. ఆమెకి ఇంటరెస్టింగ్ టాపిక్స్ అయిన మ్యూచువల్ ఫండ్లు, షేర్ మార్కెట్లు అక్కడ సర్కిల్‌లో పెద్దగా ఎవరూ మాట్లాడగలిగినవీ కాదు. అందుకని మిగిలిన వాళ్లతో తనకి ఎమోషనల్ కోషెంట్ అంతగా సరిపోదు.  చాలా సార్లు ఆమె సంభాషణలు చిరునవ్వుతో మొదలయ్యి ఓ అరనవ్వుతోనే ముగుస్తాయి.

వంటగది సింక్‌లో కప్ పెడుతూ మళ్లీ కిటికీలోంచి చూసింది. పొద్దున్న చూసిన ఆ దృశ్యం మళ్లా కనిపించింది. ఈసారి వెంటనే భర్తని కేకేసింది.

"వాసూ! ఒకసారి ఇటు చూడు. అక్కడ ఓ ట్రక్కు ఆగి ఉంది. చాలామంది పోలీసులు కూడా ఉన్నారు. ఇందాక ఏమన్నా చూసావా."

"ఊహూ. నా ఆటో బేక్ గేట్‌లోంచి వచ్చింది. వర్షం పడుతోందని హడావిడిగా లోపలికి వచ్చేశా. అటు చూడలేదు," అంటూ లేచి బయటకి వెళ్లాడు. కాసేపున్నాక అతను లోపలికి వచ్చి డ్రెస్ మార్చుకుంటుండగా అడిగింది.

"ఏమయ్యింది?"

"కొండయ్య కొడుకు. రాత్రి ట్రక్ కింద పడిపోయాట్ట. స్పాట్ డెత్," అతని మొహం విషాదంగా ఉంది.

"కొండయ్య ఎవరు?" అయోమయంగా అడిగింది.

సమాధానం చెప్పకుండా ఆమెవేపు చూసి, ఎవరెవరికో ఫోన్లు చేస్తూనే బయటకి వెళ్లిపోయాడు.

ఆ ఏక్సిడెంట్‌లో ఒక పిల్లాడు చనిపోయాడు. ఆ పిల్లాడు, అతని తండ్రీ వాసుకి బాగా తెలుసు. అంతవరకూ అర్థం అవుతోంది. కాసేపు ఆలోచనలు పక్కన పెట్టి బ్రేక్ఫాస్ట్ తయారుచేయడంలో పడిపోయింది. పాలు కలిపిస్తున్నప్పుడు కూతురు అడిగింది, "నాన్న ఏరి?"

"అక్కడ ఏదో ఏక్సిడెంట్ జరిగింది. ఎవరో కొండయ్య కొడుకట..." ఇంకా ఏదో చెప్పబోతుండగానే, "నానమ్మా," పెద్దగా కేకేస్తూ గదిలోకి పరిగెత్తింది కూతురు.

ఆమె అర్థంకానట్లు విస్తుపోయి చూస్తుండగానే కూతురూ, ఆ వెనక ఆయాస పడుతూ అత్తగారు బయటకి పరిగెత్తారు.

ఏమీ తోచనట్లు వంటగదిలోకి వెళ్లింది కానీ దూరంగా ఎవరివో మాటలు వినిపించి మళ్లా బయటకి వచ్చింది. గేట్ దాకా వెళ్లింది. అక్కడ కొందరు ఆడ వాళ్లు నుంచుని మాట్లాడుకుంటున్నారు. కానీ, ఎవర్నీ ఏమీ అడగలేదు. ఎందుకంటే వాళ్లలో చాలామంది ఆమెకి తెలియనే తెలియదు. వాళ్లలో పరిచయం ఉన్న ఒకరిద్దరితో కూడా ఏడాదికి ఒకసారో రెండుసార్లో ఎదురుపడుతుంది.

కాలనీ మధ్యలో పెద్ద పార్క్, చిన్న గుడి, ఒక కమ్యూనిటీ హాల్ ఉంటుంది. ఒక వంద కుటుంబాలుంటాయి కాలనీ అంతా కలిపి. శెలవురోజుల్లో పిల్లలంతా ఎక్కువ పార్కులోనే ఉంటారు. ఎప్పుడైనా సాయంత్రాలు త్వరగా ఇంటికి వస్తే పార్కు దాటుతున్నప్పుడు అక్కడ గుంపులు గుంపులుగా కూర్చుని కబుర్లు చెప్పుకునే ఆడవాళ్లు కనిపిస్తుంటారు. కొత్తల్లో సాయంత్రం ఎప్పుడైనా కాసేపు వెళ్లి కూర్చునేది. ఎక్కువ కబుర్లు నగల గురించో, సీరియల్స్ గురించో ఉండేవి. ఇంకొన్నిసార్లు తను వెళ్లగానే వాళ్ల ఆసక్తి అంతా తన చీరలమీదా, తనకొచ్చే జీతంమీదా ఉండేది. ఆ తర్వాత వెళ్లడం మానేసింది. అప్పుడప్పుడూ ఎవరో వస్తారు. తను ఆఫీసు నుంచి వచ్చే సమయం గుర్తుంచుకుని మరీ వస్తారు. 'మా ఇంట్లో సత్యనారాయణ స్వామి వ్రతం చేసుకుంటున్నాం. రండి,' అని పిలుస్తారు. ఎక్కువమంది వాళ్ల భర్త పని చేసే బ్రాంచ్ పేరు, ఆయన పేరూ చెప్తారు. అలా చెప్తే ఆమెకి చప్పున గుర్తు

వస్తుందని నమ్మకం. కొంతమంది తమ క్వార్టర్ నంబరో ప్లాట్ నంబరో చెప్తారు. నూటికి నూరు శాతం ఆమెకి గుర్తు ఉండదు. అప్పుడప్పుడూ ఎవరెవరో పిల్లలు వస్తారు. వినాయక చవితి పూజ అనో డిసెంబర్ ముప్పై ఒకటి పార్టీ అనో చెప్తారు. డబ్బులు అడుగుతారు. ఒక్కోసారి కాలనీలో క్రికెట్ మాచ్ పెట్టుకున్నాం, ప్రైజులు స్పాన్సర్ చేయమంటారు.. కాదనకుండా ఇస్తుంది. కానీ ఆ పిల్లలు ఎవరో, ఎవరి పిల్లలో ఆమెకి తెలీదు.

కూతురు లోపలికి వచ్చిన అలికిడికి తలెత్తి, ‘‘ఆ పిల్లాడి వయసెంత?’’ అడిగింది

‘‘నైంత్ చదువుతున్నాడు.’’ వయసు ఊహించి చెప్పగలిగే అంత పెద్దది కాదు తన కూతురు. ‘మన కాలనీలోనే ఉంటారు కదా వాళ్లు, నీకు తెలీదా,’ అన్నట్లు చూసింది.

మళ్లీ బయటకి వచ్చి చూసింది. అంబులెన్స్ బయలుదేరింది. ఆ వెనకే పోలీస్ జీపు కూడా. అక్కడ ఉన్న జనాలు ఒక్కొక్కరూ కదులుతున్నారు. తన భర్త, ఇంకొంతమందీ కార్లలో అంబులెన్స్ వెనక వెళ్తున్నారు. ఇప్పుడు ట్రక్కు ఒక్కటే ఉంది అక్కడ. ఏ క్వార్టర్ ముందైనా జనాలు పోగవుతున్నారా అన్నట్లు ఆరాగా చూసింది. ఊహూ ఎక్కడా అలాంటి ఆనవాళ్లు కనిపించలేదు. పైగా ఇంట్లో వాళ్లు ‘కొండయ్య కొడుకు,’ అనడం బట్టి సి బ్లాక్ అయి ఉంటుందని ఒక వ్యావహారికపు అంచనాకి వచ్చేసింది.

లోపలికి వెళ్లి అత్తయ్యని అడిగింది, ‘‘కొండయ్య ఎవరు?’’

ఆశ్చర్యంగా చూస్తూ చెప్పిందావిడ, ‘‘మన కాలనీ సెక్యూరిటీ.’’

అప్పుడు గుర్తొచ్చిందామెకి. కాలనీ సెక్యూరిటీ కోసం కొందరు ఉద్యోగులు ఉంటారు. సాధారణంగా సెక్యూరిటీ గార్డుల భార్యలు గార్డెన్ పనుల్లోనో, క్వార్టర్లలో ఇంటి పనుల్లోనో ఉంటారు. క్వార్టర్ల వెనక వరసగా అయిదు చిన్నచిన్న ఇళ్లు ఉంటాయి. అందులో ఎవరుంటారనిగానీ, ఆ కాలనీ సెక్యూరిటీకి ఒక మెకానిజం ఉందనీగానీ ఇవేం ఆమెకి పట్టవు. హైదరాబాద్‌లో బ్యాంక్ ఆఫీసర్‌గా చేస్తూ వారానికీ రెండు వారాలకీ ఒకసారి వచ్చే భర్త కూడా సాయంత్రాలు అలా బయటకి వెళ్లి, కనిపించిన అందర్నీ పలకరిస్తుంటాడు. మొత్తానికి చాలామంది స్నేహితులు ఉంటారు అతనికి. కూతురు కూడా చాలా ఏక్టివ్‌గా వుంటుంది. తనకి మాత్రం తన ఆఫీస్, పిల్ల చదువు, మిగిలున్న సమయంలో మార్కెట్ స్టడీ చేయడం సరిపోతుంది.

గుంపులు గుంపులుగా పోతున్న మనుషుల అలికిడి కూడా క్రమంగా తగ్గిపోయింది. కొండయ్య ఎవరన్నది మాత్రం ఇంకా అర్థం కాలేదామెకి. నెరిసిన గడ్డంతో బక్కపలచగా ఉంటాడు. అతనా? అతను మరీ పెద్దవాడిలా ఉంటాడు. నైంత్ చదివే అంత చిన్న పిల్లవాడుంటాడా? కాదేమో!

గుర్తు చేసుకుంటుంటే దాదాపు ఒక నలభై ఏళ్ల సెక్యూరిటీ గుర్తొచ్చాడు. కొంచెం లావుగా ఉండి, కాస్త వంగి నడుస్తాడు. చూసినప్పుడల్లా నవ్వుతాడు. అతనయి ఉంటాడా?

ఉండబట్టలేక రోడ్డు మీదకి వచ్చి మధ్యలో పార్కు బయట కుప్పపోసి ఉన్న ఇసుక మీద కూర్చున్న పిల్లల్ని చూసింది. అందరూ పదిహేనేళ్ల లోపల పిల్లలే. రోజూ, కొందరు రోడ్డు మీద క్రికెట్ ఆడతారు. కొందరు ఏవేవో కబుర్లు చెప్పుకుంటుంటారు. కరోనా వచ్చి స్కూళ్లకి శెలవులు ఇచ్చాక అటలు ఎక్కువ య్యాయి. ఇప్పుడు ఆన్లైన్ క్లాసులు మొదలయినా ఆటలు మాత్రం చాలావరకు తగ్గలేదు. ఈరోజు మాత్రం అందరూ చనిపోయిన ఆ పిల్లాడి గురించి మాట్లాడు కుంటున్నారు.

అక్కడున్న పిల్లల పేర్లేవీ తనకి తెలీదు. తన కూతురు కూడా అక్కడే కూర్చుని ఉంది. వాళ్ల మూడ్ చూస్తుంటే వాళ్లకి ఆ పిల్లాడు చాలా దగ్గరి స్నేహితుడిలా ఉన్నాడు.

దగ్గరగా వెళ్లి, ''ఆ పిల్లాడి ఫోటో ఉందా మీదగ్గర,'' అడిగింది.

పిల్లలెవరూ పెద్దగా రెస్పాండ్ అవ్వలేదు. కూతురు మాత్రం, 'ఏంటమ్మా,' అన్నట్లు చూసింది.

వెంటనే వెనక్కి వచ్చేసింది. అప్పుడప్పుడూ కూతురితో పాటు కొందరు పిల్లలు ఆడుకోవడానికి వస్తారు. వాళ్లల్లో ఒక పిల్లాడు కాస్త దూరంగా బెరుగ్గా ఉంటాడని పించేది. కొండయ్య కొడుకు కాబట్టి పిల్లలు అంతగా కలుపుకోరా? పిల్లలకి అలాంటి ఫీలింగ్స్ ఉంటాయా? చటుక్కున తనకి తట్టిన పిల్లాడి రూపురేఖల కోసం అక్కడున్న పిల్లల్లో వెతికింది. లేడు. కొంపతీసి ఆ పిల్లాడుగానీ ట్రక్ కింద? ఆ పొడుగాటి సన్నటి నెమ్మది పిల్లాడు ట్రక్ కింద నలిగిపోయాడా? ఆమె గుండె చిక్కపట్టినట్లు అయిపోయింది.

నీరసంగా అడుగులో అడుగు వేసుకుంటూ ఇంట్లోకి వెళ్తున్న ఆమెకి దూరంగా ఒక పిల్లాడు వస్తూండడం కనిపించింది. పొడుగాటి సన్నటి పిల్లాడే. ఒక్కసారి రిలీఫ్‌గా అనిపించిందామెకి. మరుక్షణమే మళ్లీ ఆలోచన మొదలయ్యింది. మరి కొండయ్య కొడుకు ఎవరు?

ఆ పిల్లాడు తనని దాటి వెళ్లిపోయాడు. ఆమె మాత్రం అలానే నుంచుండి పోయింది. పక్క క్వార్టర్ ఆవిడ బయటకి వస్తే బాగుండని మొదటిసారి కోరుకుంది. ఆ ఇంటిముందు కాసేపు నుంచుని మళ్లీ దాటి వచ్చేసింది.

కొంచెంసేపు అయ్యాక తను అంతకు ముందు తలచుకున్న సెక్యూరిటీ అటు వస్తూ కనిపించాడు. అతనే కొండయ్యా? ఒకవేళ అతనే అయితే అటు హాస్పిటల్‌కి వెళ్లకుండా ఇక్కడ ఎందుకుంటాడు? ఆలోచిస్తూ, అతను దగ్గరకి రాగానే, ‘‘కొండయ్య...’’ అంటూ ఆగిపోయింది.

మూడేళ్లలో ఎప్పుడూ తన మొహం వేపు కూడా చూడని మనిషి ఇప్పుడు హఠాత్తుగా పలకరించేటప్పటికి అతను ఒక్కసారి తుళ్లిపడ్డాడు. కాదన్నట్లు తలూపి అడక్కుండానే చెప్పడం మొదలెట్టాడు. బి బ్లాక్‌లో ఒక క్వార్టర్, కొత్తగా ట్రాన్స్ఫర్ మీద వచ్చిన ఆఫీసర్‌కి ఎలాట్ అయింది. సామాను పొద్దున్నే అన్లోడ్ చేయడానికి ట్రక్ వస్తోంది. ఈ పిల్లాడు ఎంవీపీ కాలనీలో న్యూస్‌పేపర్ వేస్తాట్ట పొద్దున్నపూట. ఎలా జరిగిందో ఎవరూ చెప్పలేకపోతున్నారు. టర్నింగ్‌లో వేగంగా వచ్చి వెనక నుంచి ట్రక్ గుద్ది ఉంటుంది. ఇదీ అతను చెప్పిన విషయం.

కొండయ్య భార్య చనిపోయింది. పిల్లాడు ఇలాంటి చిన్న చిన్న పనులు చేసుకుంటూనే చక్కగా చదువుకుంటున్నాడు. కాలనీలో అందరికీ తండ్రీ కొడుకులు తలలో నాలుకలాంటి వాళ్లు. కొండయ్య కొడుకు అనే అంటారు అతన్ని. అసలు పేరడిగినా అతను తడబడ్డాడు. చెప్పలేకపోయాడు. బహుశా పిల్లలకి తెలుస్తుందేమో అడగాలనుకుంది.

సాయంత్రంనుంచీ కాలనీ అంతా నిశ్శబ్దంగా అయిపోయింది. ప్రతీ రోజులా పిల్లలు ఆ సాయంత్రం గోలగోలగా ఆడట్లేదు. రోడ్డు వారన ఉండే కల్వర్టు మీద కొందరు కూర్చున్నా ఎవరి మొహంలోనూ కళ లేదు. మధ్యాహ్నం హాస్పిటల్ ప్రొసీజర్ ముగించుకుని వచ్చిన భర్త మాటల్లో కొండయ్య కొడుకు శవాన్ని వాళ్ల స్వంత ఊరు తీసుకు వెళ్లినట్లు తెలిసింది.

జరిగిన సంఘటన తల్చుకుంటే అన్నం సయించడం లేదన్న భర్తకి బలవంతంగా వడ్డిస్తూ నెమ్మదిగా అడిగింది. ‘‘కొండయ్య ఎలా ఉంటాడు? నేనెప్పుడైనా చూశానా అతన్నిగానీ, అతని కొడుకునిగానీ.’’

భర్త పెద్దగా ఆశ్చర్యపోలేదు. నువ్వంతేలే అన్నట్లు ఒక చూపు చూసాడంతే. ‘‘చెప్పినా పోల్చుకోలేవు,’’ అన్నాడు.

దిక్కు తోచలేదామెకి. లేచొచ్చి భర్తతో అంది. "ఊపిరాడడం లేదు. కాసేపలా తిరిగొద్దామా."

"వెళ్తావా." అతని సమాధానంలోనే అతను రానన్న ఇన్ఫర్మేషన్ ఉంది. ఆమె కదలకుండా నుంచునేటప్పటికి తప్పదన్నట్లు లేచాడు.

రోడ్డు మీద నడుస్తూ చాలా దూరందాకా ఇద్దరూ మాట్లాడుకోలేదు. ముందు తనే నోరు విప్పింది. "కొండయ్యకి ఏమన్నా కాంపన్సేషన్ వస్తుందా."

ఒక్కసారి అతను ఆగి ఆమె వేపు చూసి అన్నాడు. "అసలింతవరకూ అవేం ఆలోచించలేదు."

ఆ తర్వాత చాలా చెప్పాడతను. కాలనీలో కేవలం సెక్యూరిటీలా ఉండేవాడు కాదు కొండయ్య. అందరికీ కావలసిన మనుషుల్లా ఉండేవాళ్లు. తమింట్లోని గార్డెన్‌లో చాలా మొక్కలు ఆ పిల్లాడు తెచ్చి ఇచ్చినవే. పోయిన వారమే ఎవరింట్లోనో అంటు తొక్కిన మధుమాలతిని తెచ్చిచ్చాడు.

ఇంటికి వచ్చాక గేట్ పక్కన అప్పుడప్పుడే చిగుర్లు వస్తున్న మధుమాలతి కొత్తగా కనబడింది. ఇంకా కొత్తగా అప్పుడే గమనిస్తున్నట్లు తోటంతా పరికించి చూసింది. భర్త బ్యాంక్‌లో ఆఫీసర్‌గా హైయర్ పొజిషన్‌లోనే ఉన్నా, వారం వారం తిరుగుతూ కూడా ఇల్లూ భార్యా పిల్లలూ, మిగతా అభిరుచులూ వేటినీ కోల్పోకుండా బాలన్స్ చేసుకుంటుంటాడు. తను మాత్రం పనీ పనీ పనీ. గెలుపు కోసం పరిగెడుతుంది. గెలుపులోనే రిలాక్స్ అవుతుంది. పని రాక్షసి అనీ, మరీ ప్రాక్టికల్ మనిషి అనీ ఎవరన్నా అనుకున్నా పట్టించుకోదు. ఉన్న కాస్త సమయంలో కూడా ఆమె తన ఇంటలెక్చువల్ ప్లేన్స్‌లో ఇమడగలగిన స్నేహాల్ని ఎంచుకుంటుంది. విమెన్‌లో, ఆమాటకొస్తే జనరల్‌గా కూడా ఆమెవి కాస్త రేరెస్ట్ క్వాలిటీలు కాబట్టి తన స్నేహాలు కూడా చూజీగా ఉంటాయి.

ఆలోచనలు మళ్లా కొండయ్య కొడుకు వైపు మళ్లాయి. అతను ఎలా ఉంటాడు? ఆ పిల్లాడు ఈ కాలనీలోనే ఉండేవాడు. తన ఇంటి ముందు ఎన్నోసార్లు తిరిగి ఉంటాడు. తన ఇంటికీ వచ్చాడు. తన కూతురు ఈడువాడు. ఆమెతో స్నేహంగా ఉన్నాడు. తన తోటలోకి ఎన్నో మొక్కలు తెచ్చాడు. వినాయకచవితి చందా కోసం వచ్చిన పిల్లల్లో వాడూ ఉండి ఉంటాడు. భర్త మాటల ప్రకారం తమింట్లో పెద్ద టీవీలో టీ ట్వంటీ మేచ్ చూడడానికి వచ్చిన పిల్లల్లో వాడూ ఉండి ఉంటాడు. అయినా ఆ పిల్లాడుగానీ, అతని తండ్రిగానీ తనకి గుర్తు రావట్లేదు. మూడేళ్ల జ్ఞాపకాల్లో ఒక్క పొరలోనూ వాడు లేడు.

ఇంటికి వచ్చేటప్పటికి ఆఫీస్ నుంచి కాల్స్. కొన్ని కాల్స్‌లో కాలనీ ఏక్సిడెంట్ గురించిన వాకబు. బలవంతంగా పనిలో పడిపోయింది. ఎప్పుడూ తేలిగ్గా ఉండే పని ఆరోజు భారంగా అనిపించింది. తనకి తప్ప ఇంట్లోనూ కాలనీలోనూ అందరికీ ఆత్మీయుడు ఆ పిల్లాడు. కానీ ఈ ఒక్కరోజులో వాడెందుకు తనకి కూడా అంత ఆత్మీయుడయ్యాడో అర్థం కాలేదు.

కిటికీలోంచి చీకట్లో సందు మూలవేపు మళ్లా చూసింది. ఇంకా అక్కడ ట్రక్ ఉందా? చిమ్మ చీకట్లో, నిర్జనత్వంలో ఆ ఒకే ఒక్క ట్రక్కు తనకి ఏం చెప్పడానికి నుంచుని ఉంది?

రాత్రి భోజనాల దగ్గర కూర్చున్నప్పుడు కూతురు ఒక కార్డ్ తెచ్చి తండ్రికి చూపిస్తోంది. బర్త్‌డే కార్డ్. చిన్న పిల్లలు ఇద్దరు ఆడుకుంటున్న ఫోటో. కింద, 'హ్యాపీ బర్త్‌డే ప్రణతీ - వెంకటేష్ అన్న,' అని రాసుంది. పిల్లాడి పేరు వెంకటేష్ అన్నమాట. ఆ పిల్లోడు తన కూతురికి చాలా దగ్గర స్నేహితుడు. పొద్దుటి నుంచీ కూతురు దుఃఖం, అత్తగారి అక్కరా ఇప్పుడు అర్థం అవుతోంది. పుట్టినరోజున కూతురు కాలనీలో ఫ్రండ్స్‌కీ, తన క్లాస్‌మేట్స్‌కి పార్టీ ఇచ్చింది, తమింట్లోనే. ఎవరెవరు వచ్చారో తనకి తెలీదు. కావాల్సినవి ఎరేంజ్ చేసి, తను ఆఫీస్‌కి వెళ్లిపోయింది. రాత్రి ఎలాగూ యే రెస్టారెంట్‌కో డిన్నర్‌కి వెళ్తాం కాబట్టి, పగలు పిల్లకి ఆమాత్రం లిబర్టీ ఇవ్వాలి అనుకుంది. ఆ సాయంత్రం కూతురు తనకి వచ్చిన గిఫ్టులు, గ్రీటింగ్ కార్డ్స్ చూపించింది. కానీ తనే పెద్దగా పట్టించుకోలేదు. అది కూతురికి ఇస్తున్న స్పేస్ అనుకుంది. కానీ వాళ్ల చిన్నచిన్న ఆనందాల్లోంచీ, దుఃఖాల్లోంచీ తను ఫేడవుట్ అవుతోందని ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది.

వాళ్లింకా తింటుండగానే తను లేచి, కూతురు చేతిలో గ్రీటింగ్ కార్డ్ తీసుకుని సెల్లోటేప్ పెట్టి దాన్ని గోడకి అతికించింది. ఆ రాత్రి ఎంతకీ నిద్రపట్టలేదు. మధ్యలో కూతురి గదిలోకి వెళ్లి కాసేపు నిద్రపోతున్న పిల్ల పక్కన కూర్చుని వచ్చేసింది.

పొద్దున్నే సరిగ్గా నిన్నటి సమయానికి ఉలిక్కిపడి నిద్రలేచింది. అన్య మనస్కంగా గేట్ దగ్గరకి వెళ్లి, ఏక్సిడెంట్ జరిగిన జాగాని చూడ్డానికి ప్రయత్నించింది మళ్లీ. అక్కడ ఎలాంటి ఆనవాళ్లూ లేవు. అంతా మామూలుగా అసలేం జరగనట్లుంది అక్కడ. ఇంట్లోకొచ్చేసింది. డ్రాయింగ్ రూమ్, డైనింగ్ స్పేస్, కిచెన్, మూడు బెడ్ రూమ్స్, బాల్కనీ అన్నీ తిరిగింది. మెయిన్ డోర్ తెరుచుకుని గార్డెన్‌లోకి వెళ్లింది మళ్లీ. మధుమాలతి మొక్కని ఒక్కసారి ఆత్మీయంగా ముట్టుకుంది. చీకట్లో పరీక్షగా చూసింది. చిన్న మొగ్గ వస్తున్నట్లుంది.

హఠాత్తుగా ఏదో పోగొట్టుకున్నట్లు పదేపదే ఆ తీగని తడిమింది.

ఇన్నాళ్లూ ఏమన్నా పోగొట్టుకుందా? ఏం పోగొట్టుకుంది తను. తన కెరియర్, తను స్వంతంగా సంపాదించుకున్న ఆస్తులూ, ఇల్లూ, భర్తా, కూతురూ ఇవన్నీ కాకుండా వీటికి మించినదేమన్నా పోగొట్టుకుందా. సందు చివర చూస్తుంటే, 'ఇదిగో నువ్వెప్పుడూ గుర్తించని ఒక పిల్లాడు, నీ దగ్గర్లోకి చాలాసార్లు వచ్చీ నువ్వు గుర్తించని పిల్లాడు ఇక్కడే చనిపోయాడు,' అని ఎవరో అంటున్నట్లనిపించింది.

అప్పుడే బయటకి వచ్చిన భర్త తన మొబైల్ తీసి, 'ఇదుగో కొండయ్య ఫొటో, చూస్తే గుర్తు పడతావు,' అంటున్నాడు. ఆమె చూడడానికి ఇష్టపడలేదు. వెతుక్కోవడానికే నిశ్చయించుకుంది.

హఠాత్తుగా ఆమెకి దుఃఖం ముంచుకు వచ్చింది. తనకి ఎందుకు అంత దుఃఖం కలుగుతోందో ఆమెకి అర్థం కాలేదు. తను దుఃఖించడానికి కారణం ఏమన్నా ఉండి ఉంటుందా? ఆమె ఏడుస్తూనే ఉంది.

*సాక్షి ఫన్ డే*
*12 డిసెంబర్ 2021*

*



23 ఆగస్ట్ 1972న విజయవాడలో పుట్టిన **ఉమా నూతక్కి** మొదటి కథ ***శిశిర*** సారంగ అంతర్జాల పత్రికలో 2019లో వచ్చింది. దాదాపు పది కథలు రాసారు. ఎల్ఐసీలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు.

**చిరునామా:** 4-277/2, మారుతీనగర్, నవులూరు రోడ్,
మంగళగిరి-522 502
*ఫోన్: 94409 05506* ***mahi.nuthakki@gmail.com***